ఈ దేశాన్ని
బాగు చేయడానికి
అతను ఎత్తిన
కొత్త అవతారం!

యమదూత



చీకటి కోరల్లో నలిగిపోతున్న పగలు వేకువకోసం ఎదురుచూస్తోంది. కామాంధుడి ఇనుప కౌగిలి విముక్తికోసం ఎదురుచూసే కన్నెపిల్లలా!

మేఘాల చెరనుండి తప్పించుకున్న వర్షపు చినుకులు వేగంగా భూమివైపు పరుగుదీస్తున్నాయి - రాజకీయం తరిమితే నగ్నంగా నడివీధిలో పరుగెత్తే ప్రజాస్వామ్యంలా!

ఆకాశాన్ని రెండుగా చీలుస్తూ ఓ మెరుపు దాని వెంటనే మాఫియా పేల్చిన మర ఫిరంగుల్లా పిడుగు పడిన శబ్దం!

ఆ మెరుపు వెలుగులో తారు రోడ్డుమీద వేగంగా పరుగుదీస్తోంది ఎస్పీ రఘురాం నడుపుతున్న కారు.

సమాజ శ్రేయస్సు అతని ఊపిరి. అవినీతి నిర్మూలన అతని గమ్యం, స్వార్థ రాజకీయ నాయకుల గుండెల్లో ఎక్కుపెట్టిన ఎకె47 అతను. అందుకే హోం మినిస్టర్ ఆడుకునే రాజకీయపు ఆటలో అతనెప్పుడూ ట్రాన్స్‌ఫర్ బుట్టలో పడే బంతే!

ఇప్పుడతను వేగంగా కారు నడిపేది పారిపోతున్న ఓ దొంగలారీని పట్టుకోవడం కోసం.

అయితే సీతనుండి రావుని వేరుచేయడంకోసం రావణుడు సృష్టించిన 'మాయాలేడి'లా రఘురాంను ఈ లోకంనుండి పంపించడంకోసం హోం మినిస్టర్ ఏర్పాటుచేసిన 'మాయ లారీ' అని పాపమతనికి తెలియదు.

అంత వేగంగా పరుగుదీస్తున్న లారీ సడన్ బ్రేక్స్ వేసినట్లు ఆగిపోయింది. దాన్ని తాకేటంత చేరువగా వచ్చి ఎస్పీ కారు ఆగింది. అయితే వెనుకనుండి వస్తున్న మరో లారీ అంతే వేగంతో కారును ఢీకొంది. రెండు లారీల మధ్యన కారు గుజ్జులా నలిగిపోయింది.

కారు సీట్లోంచి బయటకు చిమ్మిన రక్తం భూమ్మీద పడి భూమి పొరల్లోకి ఇంకిపోయింది.

★ ★ ★

యమలోకం -

భూలోకంలో మనిషి చేసిన పాపపుణ్యాలను తిరగేస్తున్నాడు చిత్రగుప్తుడు. యమధర్మరాజు వారికి ఏయే శిక్షలు విధించాలో చూచిస్తున్నాడు.

రోదనలతో, రోగుల మూలుగులతో నిండిన

గవర్నమెంట్ హాస్పిటల్లా, పాపుల ఆహాకారాలతో గందరగోళంగా వుంది యమలోకం.

భూలోకంలో పెరిగిపోయిన స్వార్థానికి ప్రతీకలా యమలోకంలో పాపుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకే యమధర్మరాజు రెస్ట్‌లెస్‌గా కనిపిస్తున్నాడు.

సరిగ్గా అప్పుడే ఎస్పీ రఘురాం కేసు పరిశీలనకు వచ్చింది. చిత్రగుప్తుడు అతని చిట్టా తెరిచాడు.

''యమధర్మరాజా! ఈ మానవుడు భూలోకంలో ఓ పోలీసు ఆఫీసర్. నీతి నిజాయితీ ఇతనికి రెండు కళ్లు. వృత్తికోసం అంకిత భావంతో పనిచేసిన ఈ మానవుడు రాజకీయ నాయకులు పన్నిన వలలో చిక్కి ప్రాణాలు కోల్పోయాడు''

యమధర్మరాజు రఘురాంవైపు తిరిగి ''ఇది నిజమా మానవా!''

అన్నట్లు చూశాడు.

''అవునుసార్! భూలోకంలో స్వార్థం పెరిగిపోయింది. శాంతిభద్రతలు కరువయ్యాయి. హింస బలవంతుడి ఆయుధమయింది. మానవత్వం బలహీనుడి శాపంగా మారింది. దేశ సంపదను నాయకులు వాటాలుగా పంచుకుంటున్నారు. భారతమాతను పతితను చేసి పరాయి దేశాలకు అమ్మేయాలని చూస్తున్నారు''

''మహాత్ముల చేతుల్లో ఎదగాల్సిన ప్రజాస్వామ్యం నాయకుల కాళ్ల క్రింద పడి నలిగిపోతోంది సార్! స్వేచ్ఛగా ఎగరాల్సిన శాంతిపావురం బజారు రౌడీల చేతుల్లో బందీ అయిపోయింది''

''ఈ పరిస్థితుల్లో దేశానికి కావాల్సింది ఓ గాంధీ, ఓ నెహ్రూ కాదుసార్! ఓ మానవాతీత శక్తి - కొన ఊపిరితో కొట్టుకుంటున్న భారతమాత గొంతులో ప్రాణజలం పోసి కాపాడగలిగే ఓ అతీంద్రియ శక్తి కావాలి''

''దేశసౌభాగ్యాన్ని క్యాన్సర్‌లా పీల్చి పిప్పిచేస్తున్న రాజకీయ రాచపుండుకు ఇప్పుడుకూడా శస్త్రచికిత్స చేయకపోతే కొద్దిరోజుల్లోనే భారతావని స్మశానంగా మారిపోతుంది సార్''

''అందుకే భారతదేశంలో శాంతిభద్రతలను పునఃప్రతిష్ఠ చేయడంకోసం మీ ఆశీస్సులతో నన్ను భూలోకానికి పంపమని వేడుకుంటున్నాను''

అంతా విన్న యమధర్మరాజు ఏం చేయాలో తోచక చిత్రగుప్తుడివైపు చూశాడు ప్రశ్నార్థకంగా?

''మానవా నీ ఆలోచన కడు విడ్డూరముగానున్నది. అయినమా త్రిమూర్తులతో సంప్రదించి నా నిర్ణయమును తెలిపెదను'' అంతటితో ఆనాటి సభ సమాప్తమైనది.

మరుసటిరోజు సభ ప్రారంభం కాగానే యమధర్మరాజు తన నిర్ణయాన్ని తెలిపాడు.

''మానవా! నీ కోరిక నెరవేరినది. దేవునికి భయపడని మనిషి దెబ్బకు భయపడతాడు. అందుకే శాంతి, అహింసలను కాపాడే 'యమదూత'గా నిన్ను భూలోకానికి పంపిస్తున్నాను''

ఈ క్షణంనుండి నువ్వు సర్వశక్తి సంపన్నుడవు. అయితే భూలోకంలో నీ శరీరం కాలి బూడిద అయినది. అందుకే ఓ యువతి శరీరంలో నిన్ను ప్రవేశపెడతున్నాను''

''విజయోస్తు మానవా! కార్యోన్ముఖుడవై బయలుదేరుము''

★★★

బంగాళాఖాతంలో వాయుగుండం ఇంకా తీరం దాటలేదు. రెండు రోజులుగా ఒకటే వర్షం. ఉధృతమైన ఈదురుగాడ్పులు.

సిటీకి దగ్గరగా వున్న స్మశానంలో ఎవరో అప్పుడే చనిపోయిన ఓ యువతి శవాన్ని పూడ్చిపెట్టి వెళుతున్నారు.

ఆకాశంలో మెరుపు మెరిసింది. ఆ వెలుగులో

స్మశానంలోని సమాధులు నిద్రపోతున్న పిశాచాల్లా వున్నాయి. చెట్ల ఆకుల్లోంచి దూసుకొచ్చే గాలి అలికిడి ప్రేతాత్మల గుసగుసలా వుంది.

దూరంగా పిడుగు పడింది. ఆ శబ్దానికి భయపడ్డ తీతువు పెద్దగా అరుస్తూ రెక్కల చప్పుడు చేసింది.

అంతవరకూ మట్టికింద శవంలా పడి వున్న యువతి శరీరంలో కదలిక వచ్చింది. మట్టిని చీల్చుకుని లేచి నిల్చింది.

ఉధృతంగా కురుస్తున్న వర్షం ఆమె శరీరానికి అంటుకున్న మట్టిని కడిగేస్తుంటే ఆమె స్థిర నిశ్చయంతో ముందుకు సాగిపోయింది. అలా నడుస్తూనే వెళ్లి ఓ టెలిఫోను బూతును చేరి కావాల్సిన నెంబరు డయల్ చేసింది. అవతలివైపు రిసీవర్ ఎత్తిన శబ్దం.

''హలో! హిందూ దినపత్రికా కార్యాలయమా? మీకో ఫ్లాష్ న్యూస్. రేపు జరుగనున్న బహిరంగసభలో హోం మినిస్టర్‌ను చంపబోతున్నాను''

వింటున్న ఎడిటర్ గొంతులో ఆందోళన, ఆశ్చర్యం, భయం, సెన్సేషనల్ న్యూస్ దొరికినందుకు ఆనందం.

''హలో! ఎవరు మీరు.''

''యమదూత'' లైన్ కట్టయింది.

తరువాత అన్ని పత్రికలకూ అదే విషయాన్ని అందించింది.

మరుసటిరోజు అన్ని పత్రికల్లోనూ ఒకటే వార్త.

''హోమ్ మినిస్టర్‌ను చంపుతానన్న యమదూత'' అంటూ మొదటి పేజీలో ప్రచురించబడినది.

★ ★ ★

రాత్రి ఏడు గంటలు -

ఆరోజు హోం మినిస్టరుకు సన్మానం.

అభివాదనలతో, ఏం జరుగుతుందో చూడాలన్న కోరికతో సభకు ఇసుక వేస్తే రాలనంతగా వచ్చారు జనం.

కారులోంచి దిగిన హోం మినిస్టర్ నేరుగా వేదిక మీదకు వెళ్లాడు. ఆయనకు కాపలాగా ఇరువైపులా ఇద్దరు బ్లాక్ కమెండోస్. సభలో ప్రతి పది గజాలకో ఆర్మ్‌డ్ పోలీసు.



ప్రముఖులు ఒక్కొక్కరూ మంత్రి మెడలో పూలమాల వేసి మెప్పుకోసం అతన్ని కీర్తిస్తున్నారు.

వేదిక మీదికి వెళ్లే అందరినీ మెటల్ డిటెక్టర్స్‌తో పరిశీలించి పంపుతున్నారు.

చేతిలో పూలదండలతో వేదిక మీదకెళ్లిందామె. ఆమె దగ్గర ఎలాంటి ఆయుధమూ లేదు. అందుకే ఎవ్వరూ అడ్డుచెప్పలేదు.

దండను మంత్రి మెడలో వేసి మైకు దగ్గరకు వెళ్లింది.

''ప్రియమైన ప్రజలారా! హోం మినిస్టర్‌ను చంపుతానని పత్రికలకు ఫోన్ చేసిన యమదూతను నేనే!''

ఆమె మాటలు ఇంకా పూర్తికాలేదు. కాపలా కాస్తున్న కమెండో ఆమె మీదికి బుల్లెట్ల వర్షం కురిపించాడు. కాని ఆమె 'యమదూత'. అందుకే రూపం చెక్కు చెదరలేదు.

మరో కమెండో పట్టుకోవడం కోసం ముందుకురికాడు. బలంగా చాచి మెడమీద కొట్టింది. ఆ దెబ్బకు పది గజాల దూరంలో జనం మధ్యన పడిపోయాడు.

భయంతో స్టేజీమీద నాయకులు పారిపోయారు ఒక్క హోం మినిస్టర్ తప్ప.

హోం మినిస్టర్ కాలర్ పట్టుకుని పైకి లేపింది యమదూత. అతన్ని బరబరా మైకు దగ్గరకు ఈడ్చుకొచ్చింది.

''ప్రియమైన ప్రజలారా! ఈ దేశాన్ని కాపాడాల్సిన అత్యున్నతమైన శాఖలో వుండి, డబ్బుకోసం ఈయనగారు ఇదే దేశాన్ని అమ్మాలని చూశాడు. అడ్డొచ్చిన ఆఫీసర్లను నామరూపాలు లేకుండా చేశాడు. టెర్రరిజాన్ని ప్రోత్సహించి, వారికి అక్రమంగా ఆయుధాలు అందేలా చూశాడు. ఆడపడుచుల శీలంతో తన ఆస్తులను పెంచుకున్నాడు. ఇంకా ఎన్నో.... ఎన్నెన్నో!!

అందుకే దేశ శ్రేయస్సు కోసం యమదూతగా నా శిక్షను అమలుచేస్తున్నాను. ఆమె చేతివ్రేళ్లు హోం మినిస్టర్ మెడలో బాకుల్లా దిగాయి. అర నిమిషంలో అతని ప్రాణం అనంత వాయువుల్లో లీనమైంది.

ఇసుక వేస్తే రాలని జనంలో చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం. అంతా నోళ్లు తెరిచి ఓ అద్భుతాన్ని చూస్తున్నట్లు చూడసాగారు.

ఆ నిశ్శబ్దంలోంచి ఆమె కంఠం షార్ప్‌గా వినిపిస్తోంది.

''దేశద్రోహులకు, సంఘవిద్రోహులకు ఇదే హెచ్చరిక! ఎక్కడ అన్యాయం జరుగుతుందో, ఎక్కడ సగటు మనిషి పీడింపబడతాడో అక్కడ ఈ యమదూత ప్రత్యక్షమవుతుంది.''

''ఈ దేశ శ్రేయస్సుకోసం సృష్టించబడిన అపర శక్తిని నేను. నాకు లక్ష కళ్లు, అనుక్షణం దేశాన్ని కాపలా కాస్తుంటాయి''

''మహాత్ముల ఆశయాలను మత్తుమందులో కలిపి త్రాగే నాయకులకు ఇదేనా సవాల్! స్వేచ్ఛగా ఎగరాల్సిన శాంతిపావురం గుండెలో తుపాకీ గుండ్లను దించకండి. దేశ రక్షణలో మీరు భాగం పంచుకోండి. హద్దు మీరితే హోం మినిస్టర్ గతే మీకూ పడుతుంది''

ఆమె స్టేజి దిగింది. జనం రెండుగా చీలి ఆమెకు దారిచ్చారు. తెల్లవారింది. అందరి చర్చల్లోనూ 'యమదూత' ప్రధానాంశమయింది. అన్ని పత్రికలు యమదూతకు బ్రహ్మరథం పట్టాయి. ఆమె అపరశక్తా? కలియుగ కాళికా? లేక ప్రేతాత్మా? ఏది ఏమైనా అన్యాయంపైకి ఎక్కుపెట్టిన బాణం.

మొదటిరోజే యమదూతకు ఊహించని పాపులారిటీ.

★★★

బొంబాయి, కలకత్తా మాఫియాకు పెట్టింది పేరు. అలాంటి చీకటి సామ్రాజ్యాన్ని కూకటి వేళ్లతో పెకిలించడం యమదూత తదుపరి కర్తవ్యం.

ప్రణాళికలో భాగంగా అండర్ వర్ల్డ్ డాన్లందరికి వర్తమానం పంపించింది. అప్పటికే యమదూత శక్తి విన్న దాదాలు చిన్నా, పెద్దా అంతా వందకు పైగా ఓ హోటల్‌లో సమావేశమయ్యారు.

అందరినీ కలియజూసి, రావాల్సినవారంతా వచ్చారనుకున్న తరువాత చెప్పడం ప్రారంభించింది.

''డియర్ ఫ్రెండ్స్! నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన మీ అందరికీ థాంక్స్''

''ఈనాటి దేశ పరిస్థితి మీకు తెలుసు''

ఆడది ఒంటరిగా తిరగగలిగే రోజుకోసం ఎదురుచూసిన మహాత్ముడు కన్నుమూశాడు. ఆయన ఆశయం నెరవేరలేదు. పైగా పట్టపగలు మగవాడి జీవితానికే రక్షణ లేకుండా పోయింది.

''అసలు దేశాన్ని పాలించేది ప్రజాస్వామ్యమో? లేక చీకటి సామ్రాజ్యమో తెలియక ప్రజలు అలమటిస్తున్నారు''

''ఒకవేళ గాంధీని గాడ్సే ఆరోజు చంపి వుండకపోతే అహింసను చాటిన పాపానికి అతని రక్తంతో శాంతిపావురానికి అభిషేకం చేసేవారు''

''భూకంపాలు వస్తే బీటలు వారాల్సిన నేల బాంబుల హోరుతో అనుక్షణం దద్దరిల్లుతోంది. వరదలొస్తే ఉక్రోషించే సముద్రం రక్తపు ప్రవాహపు ఆటుపోటులను తట్టుకోలేకపోతోంది''

''ఈనాడు స్వేచ్ఛ కారాగారాల్లో మృత్యుకేళి ప్రతిధ్వనిస్తోంది''

''దీనికి కారణం ఎవరో మీకు తెల్సు''

''అందుకే ఈ క్షణం నుండి మీరంతా మీ వృత్తిని మానుకోవాలి. జన జీవన స్రవంతిలో మీరూ ఒకరు కావాలి. అక్రమంగా సంపాదించిన మీ ఆస్తినంతా ప్రభుత్వపరం చేయాలి''

ఆమె చెప్పడం పూర్తికాలేదు. ఆమె మీదికి ఎకె-47 నిప్పులు కక్కింది. చురకత్తులు బాణాల్లా దూసుకొచ్చాయి. మామూలు మనిషయితే పోస్టుమార్టంకూడా సాధ్యపడని రీతిలో చనిపోయేది. కానీ ఆమె 'యమదూత'. అందుకే ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. నెత్తుటి సురకలూ లేవు'

ఒక్క క్షణం ఆమె వారిని పరిశీలించింది. ఆ చూపుల్లో కాళిక క్రౌర్యం వుంది. భద్రకాళి

ఉద్యోగం

''మా ఆఫీసరు నన్ను ఉద్యోగంలోనుంచి తీసివేస్తానంటున్నాడు. ఇప్పుడు నేనేం చేయాలి'' అడిగాడు గంగులు.

''ఇంకేం చేస్తావ్! ఆ దొంగతనాలు, దోపిడీలతోనే గడిపేయ్'' చెప్పాడు చిత్రానందం.

- జి.వెంకటేశ్వరరావు (ప్రసాదంపాడు)

రుద్రత్వం వుంది. కాంతి వేగంతో పరుగెత్తే మిసైళ్లున్నాయి.

పదడుగులు ముందుకేసి కూర్చున్న దాదా కాలర్ పట్టి పైకి లేపింది. పిడికిలి బిగించి ముఖంపై బలంగా గుద్దింది.

మొదట్లో నోట్లో నీళ్లు ఉప్పుగా తగిలాయి. తడిమి చూస్తే ముక్కుల్లోంచి, పెదాలనుండి కారిన రక్తం జిగటగా, వేడిగా తగిలింది. ఇంద్రియాలు పనిచేయడం మానేశాయి. మొదలు నరికిన చెట్టులా కుప్పకూలిపోయాడు.

అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. ఏ ఒక్కరికీ నాలుక కదిపే ధైర్యం లేక!

''ఇప్పుడు దేశానికి కావాల్సింది గౌతమ బుద్ధులు, గాంధీలు కారు. రక్తానికి రక్తం చిందించే నాలాంటి యమదూతలు''

''ఖబడ్దార్! ఈ క్షణంనుండే మీరుసాధారణ పౌరులు, అందరిలా కాయకష్టం చేసే శ్రామికులు - ఇది నా శాసనం. యమ శాసనం. ఎవరైనా అతిక్రమించినా తలలెగిరిపోతాయి జాగ్రత్త... జాగ్రత్త... జాగ్రత్త...

ఆమె హోటల్ రూంనుండి బయటకు వెళ్లింది.

ఆమె వెళ్లిన తర్వాత ఎవ్వరూ మాట్లాడలేదు. యమదూతకు లక్షకండ్లు, చెవులు. ఏం మాట్లాడితే ఏం జరుగుతుందోనన్న భయం - మౌనంగా వెళ్లిపోయారు.

★★★

ప్రజల్లో ఇప్పుడు కొత్త చైతన్యం వచ్చింది. ఇదివరకులా కాకుండా ఇప్పుడు స్వేచ్ఛగా తిరుగుతున్నారు.

ఆడపిల్లలనేడ్పించే రోమియోల సంఖ్య తగ్గింది. ఒకవేళ ఎవరైనా ప్రయత్నించినా యమదూత పేరు చెప్పగానే 'చెలియా' అన్నవాడు 'చెల్లీ' అంటున్నాడు.

రాజకీయ నాయకుల్లో కలవరం బయలుదేరింది. ప్రజల డబ్బుతిని పందికొక్కుల్లా బలిసినవారు 'యమదూత' మూలంగా మనో వ్యాధితో చిక్కి చిట్టెలుకలయ్యారు.

ఒకరోజు ఇన్‌కంటాక్స్, ఇంకోరోజు కలెక్టర్లను, మరో రోజు ముఖ్యమంత్రులను సమావేశపర్చింది. దేశాభివృద్ధికోసం చేయవలసిన పనులను సూచించింది. ప్రజా సంక్షేమంకోసం ఇకనైనా పనిచేయమని వారిని హెచ్చరించింది.

భార్యలను వేధించే భర్తలకోసం న్యాయస్థానాలు ఏర్పాటయ్యాయి. ఒకవైపు మాఫియా, మరోవైపు టెర్రరిస్టులు జనజీవనంలో కల్సిపోయారు.

రోజులు మారుతున్నాయి. నెల్లలు గడుస్తున్నాయి. సంవత్సరాలు దొర్లుతున్నాయి. ఇప్పుడు దేశంలో అరాచకత్వం లేదు. అల్లర్లు లేవు. కులమతాల కుమ్ములాటలు లేవు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

జూదం, వ్యభిచారం, తాగుడు అన్న పదాలను ప్రజలు దాదాపు మరచిపోయారు.

లంచం తీసుకున్న కొందరి చేతుల్ని యమదూత నరికేసింది. దాంతో కార్యాలయాల్లో పేరుకున్న స్తబ్దత క్రమంగా తొలగిపోయిది.

ఇప్పుడు వరకట్నపు చావులు లేవు. అసలు వరకట్నం అడిగితేనే నేరం.

కష్టాల్లో ప్రజలు దేవునికి బదులు యమదూతను స్మరిస్తున్నారు.

ఈలోగా ఎలక్షన్లు వచ్చాయి.

అయితే యమదూత ఆదేశనుసారం ఎక్కడా మైకుల హోరులేదు. సభలకు తరలివెళ్లే లారీలు లేవు. ఒక పార్టీ మరో పార్టీని దూషించకూడదు. చేసే ప్రతి వాగ్దానాన్ని సంవత్సరంలోగా నెరవేర్చగలిగి వుండాలి.

నాయకులు నియోజకవర్గంలోని ఇంటింటికి తిరిగి ప్రచారం చేసుకుంటున్నారు. ఆ విధంగానైనా నాయకుల ముఖాలను ప్రజలు చూడగలుగుతున్నారు.

ఎలక్షన్ల రోజు ప్రజలంతా ధైర్యంగా ఓటువేశారు. ఎక్కడా రక్తపాతంగాని, రిగ్గింగ్‌గాని జరుగలేదు. ఆశ్చర్యకరమైన విషయం ఎలక్షన్లలో ఎక్కడా ఒక్క పోలీసు కూడా కనిపించకపోవడం.

అన్నింటికంటే వింతైన విషయం చరిత్రలో మొట్టమొదటిసారిగా జీతాలమీద పనిచేసే మంత్రి మండలి ఏర్పాటు కావడం.

రోజులు గడుస్తున్నాయి. దేశం ఆర్థికంగా పుంజుకుంది. ప్రపంచ దేశాలకు పోటీగా నిలబడింది. కష్టించి పనిచేసేవారి సంఖ్య పెరిగింది.

ఇప్పుడు కులం లేదు. మతం లేదు. అంతా ఒకటే జాతి - మానవజాతి.

నిజమైన ప్రజాస్వామ్యం రామరాజ్యాన్ని తలపిస్తుంది.

మహాత్ముని ఆశయం మొగ్గై విచ్చుకోగా - బుద్ధుని ప్రవచనాలు పరిమళమై చుట్టుముట్టగా - పల్లెల్లో రైతన్నల జానపదాలు, సరిహద్దుల్లో సిపాయిల కదన కుతూహలరాగాలు - శ్రీహరికోట రాకెట్‌తో కల్సి, 'సారే జహాసే అచ్ఛా' అంటూ దేశ ఖ్యాతిని దిగంతాలకు చాటగా భారతమాత కన్నుల్లో మళ్లీ గత వైభవపు కాంతులు తొంగిచూశాయి.

★ ★ ★

మెల్లగా కళ్లు తెరిచాడు రఘురాం.

పరిసరాలన్నీ కొత్తగా వున్నాయి. చేయి కదల్చబోయాడు. విరిగినట్లుంది. కలుక్కుమంది. శరీరంనిండా బ్యాండేజీ కట్లు. తనున్నది ఓ హాస్పిటల్ అని అర్థం చేసుకున్నాడు.

అప్పటివరకూ జరిగిన ఒక్కో సంఘటన గుర్తుకురాగా, అవి కలలో జరిగినవి అని తెలియగానే, అతన్ని నిరుత్సాహం నిలువునా చుట్టుకుంది. అతని ఆలోచనల్లో మళ్లీ స్తబ్దత వల్లు విరుచుకుంది. తలెత్తి శరీరంమీది కట్లను చూసుకున్నాడు. తన సిన్సియారిటీకి ప్రభుత్వం ప్రకటించిన బహుమానం.

అతని కళ్లల్లో అప్రయత్నంగా నీళ్లు చిమ్మాయి. ఆ కన్నీటికి మాటలొచ్చాయి.

'ఏడుస్తున్నావా రఘురాం! ఈ దేశ పరిస్థితి మారలేదని విచారిస్తున్నావా?

నిరుత్సాహాన్ని నీ మనస్సు పొరల్లోంచి ఆవలికి తోసెయ్, నిరాశను నీ గుండె గదుల్లోంచి బయటకు నెట్టేయ్.

నీ ఆదర్శం మరికొందరికి మార్గదర్శకమైతే, నువ్వు కలలుగన్న 'మరో ప్రపంచం'లో నీ ముంగిట మళ్లీ స్వేచ్ఛగా ఎగిరే శాంతి పావురాల రెక్కల చప్పుడు వినిపిస్తుంది.